సాక్షి
కాకినాడ

సోమవారం । 10 । జూన్ । 2024



రూ.లక్ష విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బోడపాటి పద్మనాభం దంపతులు (పి.గన్నవరం) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి రూ.లక్ష

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి గునిశెట్టి రాంబాబు, విజయలక్ష్మి దంపతులు (అంతర్వేది) రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు నీటి విడుదల పెంపు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం నీటి విడుదలను 7 వేల క్యూసెక్కులకు పెంచారు. తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.40 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

14న మెగా రక్తదాన శిబిరం



మెగా రక్తదాన శిబిరం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న కాకినాడలోని అన్ని రోటరీ క్లబ్బుల ఆధ్వర్యాన స్థానిక సూర్య కళా మందిరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు గోపు కాశీ విశ్వనాథ్, నరహరశెట్టి రవికృష్ణ, మైలపల్లి విద్యాసాగర్‌లు రోటరీ క్లబ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ శిబిరంలో రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఆపదలో ఉన్న వారికి ప్రాణ దానం చేయాలని పిలుపునిచ్చారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం



దాతలకు విరాళం రశీదు అందిస్తున్న ఆలయ ఉద్యోగి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి అడపా రామకృష్ణ, పార్వతి దంపతులు (భీమవరం) ఆదివారం రూ.50 వేల విరాళం అందజేశారు. తమ కుమారుడు లక్ష్మీనరసింహరాజు పేరిట ఈ మొత్తం అందజేశారని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు.

లోవకు భక్తుల తాకిడి



తలుపులమ్మ తల్లి దర్శనానికి మెట్ల మార్గంలో వెళుతున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వేలాదిగా వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 16 వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. అమ్మవారి ప్రత్యేక దర్శనానికి అరగంట, సర్వ దర్శనాలకు గంట సమయం పట్టింది. లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.2,70,135, పూజా టికెట్లకు రూ.1,70,650, కేశఖండన శాలకు రూ.36,040, వాహన పూజలకు రూ.3.700, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.86,016, విరాళాలు రూ.47,980 కలిపి మొత్తం రూ.6,14,521 ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు.

బుచ్చిబాబుకు గీత పరామర్శ



బుచ్చిబాబును పరామర్శిస్తున్న గీత

కొత్తపల్లి: ఉప్పెన సినిమా దర్శకుడు సానా బుచ్చిబాబును కాకినాడ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నేత వంగా గీత ఆదివారం పరామర్శించారు. పితృవియోగంతో బాధ పడుతున్న బుచ్చిబాబును కొత్తపల్లిలోని ఆయన నివాసంలో పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుచ్చిబాబును పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు, కారే శ్రీనివాస్, రావు చిన్నారావు, ఉమ్మిడి జాన్, సర్పంచ్ కర్రి చిన్నారావు తదితరులున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తుని: ఈ నెల 22న జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ తుని డిపో మేనేజర్ ఎన్.కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ బస్సు తుని డిపో నుంచి ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనానంతరం అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షిణ అనంతరం కంచి, విజయవాడ కనక దుర్గమ్మ దర్శనానంతరం తుని చేరుకుంటుందని తెలిపారు. టికెట్టు రూ.3,500గా నిర్ణయించామన్నారు. వివరాలకు 73829 13216, 73306 51904, 73829 13016 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



గోదారి సీనంటే.. బొమ్మ బ్లాక్‌బస్టరే..

- సినీ చిత్రీకరణలకు నెలవైన గోదావరి
- వేగేశ్వరపురం ఒడ్డు హిట్టుకు తొలి మెట్టు
- మలకపల్లిలో భవనం చిత్రసీమకు నందనం
- కుమారదేవంలో 150 ఏళ్ల సినిమా చెట్టు
- గోష్పాద క్షేత్రం సినీవర్గాల పుణ్యధామం

తాళ్లపూడి: వయ్యారి గోదారి పరవళ్లు.. ఒంపులు తిరిగిన గోదారి గట్లు.. ఆపైనుండే గుడి గోపురాలు.. నీటి మధ్య ఇసుక తిన్నెలు.. లంకలు.. సూర్యోదయాస్తమయ వేళల్లో గోదారమ్మ నుదుటిన అలదుకునే సిందూరం.. పావన నదిపై నీలి మేఘాలంకరణలు.. ఇలా ఒకటా రెండా.. ఎన్నని చెప్పేది గోదారోళ్ల సౌభాగ్యం. భౌతిక నేత్రంతో చూసే భాగ్యం ఇక్కడివారిదైతే.. ఇవే దృశ్యాలను వెండితెరపై చూసి అచ్చెరువొందే.. జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రాంతాలను సందర్శించాలని భావించేవారెందరెందరో..

కొంత కళాత్మక దృష్టి.. ఒకింత భావుకత.. మరికొంత రసరమ్యమైన మనసు.. వీటికి తోడు భావగర్భితమైన కెమెరా కన్ను.. చాలు.. ఓ సుందర దృశ్యకావ్యాన్ని వెండి తెరపై ఆవిష్కరించడానికి. ఇలాంటి మనసున్న దర్శక, నిర్మాతలెందరో మన గోదావరిని అమ్మగా.. కొంటె కోణంగిగా.. వయ్యారిభామగా.. పడుచు పిల్లగా.. మరెన్నో విధాలుగా వెండి తెరపై ప్రపంచానికి చూపించి వారి జీవితాలను సార్థకం చేసుకున్నారు. ఎన్నో వైవిధ్యమైన కథలకు నేపథ్యంగా గోదావరి పరీవాహక ప్రాంతాలను ఎన్నుకుని ఎనలేని కీర్తిని గడించారు.

తెలుగు సంస్కృతికి ప్రతీకలు గోదావరి జిల్లాలు. ఇక్కడి ప్రజల వాడుక భాషే 'చిత్ర' భాషగా వ్యవహరిస్తారు. ఇక్కడి ఆచార వ్యవహారాలే ప్రామాణికంగా భావిస్తారు. దర్శక దిగ్గజాల్లో ఒకరైన నాటి ఆదుర్తి సుబ్బారావు నుంచి నేటి శేఖర్ కమ్ముల వరకూ ఎందరో గోదావరి అందాలతో వారి చిత్రాలను సుసంపన్నం చేసుకున్నారు. కళాతపస్వి కె.విశ్వనాథ్, బాపు, దాసరి నారాయణరావు వంటి అగ్ర దర్శకులే కాక.. ఈ ప్రాంతానికే చెందిన వంశీ తీసిన చాలా సినిమాలు గోదావరి నది నేపథ్యంగా సాగినవే. వారిలో చాలా మందికి పాపికొండల నుంచి అంతర్వేది వరకూ ఎన్నో ప్రాంతాల్లో కనీసం ఒక్క సన్నివేశమైనా చిత్రీకరిస్తే చాలు.. ఆ చిత్రం హిట్టు కొట్టేస్తుందనేది గట్టి నమ్మకం



వేగేశ్వరపురంలో గోదావరి ఒడ్డున ఎక్కువ హిట్ చిత్రాలు తీసిన రావిచెట్టు

కొవ్వూరు పరిసరాల్లో..

ముఖ్యంగా కొవ్వూరు మండలంలోని గోష్పాద క్షేత్రం, కుమారదేవం, ఆరికిరేవుల, తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో గోదావరి తీరాన తీసిన ప్రతి సినిమా సూపర్ హిట్టే. వేగేశ్వరపురంలో గోదావరి ఒడ్డున ఉన్న ఆంజనేయుని ఆలయం రేవు, బల్లిపాడు ఇసుక ర్యాంపు లంకలు, మలకపల్లిలోని కుంటముక్కల వారి గృహంలో అనేక సినిమాల్లో చాలా సన్నివేశాలే చిత్రీకరించారు.

- వేగేశ్వరపురంలో చిరంజీవి నటించిన రక్తసిందూరంలోని ఓ పాటను, రామ్‌చరణ్, సమంత నటించిన రంగస్థలంలోని పలు సన్నివేశాలను తాడిపూడి, వేగేశ్వరపురం గోదావరి లంకల్లో చిత్రీకరించారు.
- నాని హీరోగా నటించిన శ్యామ్ సింగరాయ్ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు తాళ్లపూడిలోనే తీశారు.
- సాయికుమార్, ఆయన కుమారుడు ఆది కథానాయకుడిగా నటించిన చుట్టాలబ్బాయ్ చిత్రంతో పాటు, మంచు మనోజ్, రెజీనా నటించిన శౌర్య చిత్రంలో పలు కీలక సన్నివేశాలను ఇక్కడే తెరకెక్కించారు.
- నాగార్జున, అనుష్క నటించిన ఢమరుకం చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలను గోదావరి నది ఒడ్డున ఆంజనేయస్వామి గుడి వద్ద తీశారు. ప్రత్యేకంగా రుషుల కోసం ఒక సెట్ వేసి వారం రోజుల పాటు ఇక్కడ షూటింగ్ చేశారు.
- సుమంత్ నటించగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన గోదావరి, వంశీ దర్శకత్వంలో అల్లరి నరేష్ నటించిన సరదాగా కాసేపు చిత్రంలో కారులో వెళ్లే పాటను ఇక్కడే చిత్రీకరించారు.
- జగపతిబాబు, ప్రియమణి నటించిన పెళ్లైన కొత్తలో చిత్రంలో వారి స్నానపు సన్నివేశాన్ని ఇక్కడే తెరకెక్కించారు.
- ప్రక్కిలంకలో కృష్ణ నటించిన పాడిపంటలుతో పాటు, చంద్రమోహన్ నటించిన సిరిసిరిమువ్వ ఈ ప్రాంతంలో చిత్రీకరించినవే.
- శ్రీకాంత్, చార్మి నటించిన చిత్రంలోని ఓ పాటను, శివాజీ హీరోగా నటించిన మిస్టర్ ఎర్రబాబులో మిత్రులతో కలిసి కథానాయికను ఆయన పరిచయం చేసుకునే సన్నివేశాన్ని, సునీల్‌పై హాస్య సన్నివేశాలను, ఆలీ నటించిన ఆషాఢం పెళ్లికొడుకులో ఒక పాటను ఇక్కడి ఇసుక తిన్నెల్లో ప్రత్యేకంగా సెట్ వేసి చిత్రీకరించారు.
- కేవలం సినిమాలే కాకుండా కొన్ని ధారావాహికలు సైతం ఇక్కడి గోదారి ప్రాంతాల్లో చిత్రీకరించారు.



వేగేశ్వరపురంలో గోదావరి మధ్యన రంగస్థలం సినిమా షూటింగ్ సందడి



శౌర్య చిత్రంలో హీరోయిన్ రెజీనాపై వేగేశ్వరపురం వద్ద గోదావరి రేవులో సన్నివేశం చిత్రీకరణ

150 ఏళ్ల నాటి సినిమా చెట్టు

కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న నిద్రగన్నేరు చెట్టుకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఇక్కడ సుమారు 200 పైగా సినిమాల షూటింగ్‌లు జరిగాయి. దీంతో, దీనికి 'సినిమా చెట్టు'గా పేరొచ్చింది. ఇక్కడ సినిమా తీస్తే తప్పకుండా హిట్ అవుతుందన్న సెంటిమెంట్ చిత్రసీమలో స్థిరపడిపోయింది. ఈ నమ్మకంతోనే ఒక్క సీన్ అయినా ఈ చెట్టు కింద తీస్తారు. మొదటిగా కృష్ణ హీరోగా 1975లో పాడిపంటలు ఈ చెట్టు వద్ద చిత్రీకరించారు. ఏఎన్ఆర్, ఎన్టీఆర్, చిరంజీవి, శోభన్‌బాబు, బాలకృష్ణ, మోహన్‌బాబు, సుమన్, మహేష్‌బాబు, రామ్‌చరణ్, రాజశేఖర్, నాని తదితర హీరోలతో పాటు, దర్శకులు వంశీ, రాఘవేంద్రరావు, క్రాంతికుమార్, సుకుమార్ ఈ చెట్టు కింద ఏదో ఒక సన్నివేశాన్ని చిత్రీకరించడం సెంటిమెంట్‌గా భావిస్తారు.



తాళ్లపూడి వద్ద గోదావరి తీరంలో శ్యామ్ సింగరాయ్ చిత్రం షూటింగ్‌లో పాల్గొన్న హీరో నాని

షూటింగ్‌ల అడ్డా.. గోష్పాద క్షేత్రం

కొవ్వూరు గోష్పాద క్షేత్రం పలు హిట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. జూనియర్ ఎన్టీఆర్, భూమిక నటించిన హిట్ చిత్రం సింహాద్రిలో ఇంటర్వెల్ సీన్ ఇక్కడే తీశారు. అలాగే సుకుమార్ దర్శకత్వంలో 100 పర్సంట్ లవ్‌తో పాటు గుండెల్లో గోదారి, బెండు అప్పారావు ఆర్ఎంపీ తదితర అనేక చిత్రాలు ఇక్కడ తీశారు. ఇలా గోదావరి తీరంలో ఏటా చాలా చిత్రాల షూటింగులు జరుగుతూనే ఉంటాయి.

హిట్ చిత్రాల భవనం


సుమారు 110 ఏళ్ల క్రితం మలకపల్లిలో ఆ గ్రామానికి చెందిన కుంటముక్కల వీరభద్రరావు, వెంకటాద్రి, జానకిరామయ్య లోగిలిని అత్యాధునికంగా నిర్మించారు. ఈ గృహంలో సినిమా తీస్తే హిట్ గ్యారెంటీ అని చిత్రరంగ ప్రముఖుల్లో గట్టి నమ్మకం.

- జంధ్యాల దర్శకత్వంలో 1985లో వచ్చిన సీతారామకల్యాణం చిత్రం ఎక్కువ భాగం ఈ ఇంట్లోనే తీశారు.
- ఆ చిత్రం విజయం సాధించడంతో సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో డి.సురేష్‌బాబు నిర్మాతగా బి.గోపాల్ దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా నటించిన బొబ్బిలిరాజా చిత్రంలోని కీలక సన్నివేశాలను కూడా ఈ ఇంట్లోనే తెరకెక్కించారు.
- అలాగే క్రాంతికుమార్ దర్శకత్వంలో వచ్చిన సీతారామయ్య గారి మనవరాలు, బాలకృష్ణ నటించిన సీతారామ కల్యాణం, నరేష్ నటించిన ప్రేమచిత్రం.. పెళ్లి విచిత్రం, ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో శోభన్‌బాబు నటించిన ఏవండీ ఆవిడ వచ్చింది, ఇంకా.. సీతారత్నం గారి అబ్బాయి, తాళి తదితర చిత్రాలన్నీ విజయం సాధించాయి.
- ఇదే గ్రామంలో దివంగత కుంటముక్కల భాస్కరరావు గృహానికి 140 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రేమ విజేత అనే చిత్రం, రజనీకాంత్ నటించిన తమిళ సినిమా, జగదాంబ టూరింగ్ టాకీస్ తదితర సినిమాల్లో చాలా సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. అప్పట్లో డి.రామానాయుడు ఇక్కడి గ్రంథాలయానికి రూ.30 వేల విరాళం అందజేశారు. దీంతో గ్రామస్తులు ఆ భవనానికి మరమ్మతులు చేసి, రామానాయుడు గ్రంథాలయంగా పేరు పెట్టారు. రామచరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తాజాగా నిర్మిస్తున్న గేమ్ చేంజర్ చిత్రంలోని కీలక సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.

మలకపల్లిలో హిట్ చిత్రాలు ఎక్కువగా తీసిన కుంటముక్కల వారి ఇల్లు



కుమారదేవంలో గోదావరి ఒడ్డున 200 పైగా చిత్రాలు తీసిన హిట్ చిత్రాల సినిమా చెట్టు



రత్నగిరి కిటకిట



రథోత్సవంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ రోహిత్, అధికారులు

అన్నవరం: రత్నగిరి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు ఈ నెల 12వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో వేలాదిగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలసి వచ్చి, సత్యదేవుని వ్రతమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఇతర భక్తులు కూడా తోడయ్యారు. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు మూడు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

కన్నుల పండువగా సత్యదేవుని రథోత్సవం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకుని వచ్చారు. ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేయించి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు, పరిచారకుడు ముత్య వేంకట్రావు పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కొబ్బరి కాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాకారంలో నాలుగు వైపులా కొబ్బరి కాయలు కొట్టి ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

పంపా గేట్లకు త్వరలో మరమ్మతులు

- ఈ వారంలో తాత్కాలిక పనులు
- రూ.30 లక్షలతో ప్రతిపాదనలు
- గోదావరి డెల్టా సీఈ సతీష్ కుమార్

అన్నవరం: పంపా రిజర్వాయర్ బ్యారేజీ గేట్లకు రూ.30 లక్షల వ్యయంతో మరమ్మతులు చేయాలని నిర్ణయించినట్లు గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ (సీఈ) ఆర్.సతీష్ కుమార్ తెలిపారు. త్వరలో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ఈ పనులు ఈ వారంలోనే ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. గత శుక్రవారం ఆయన పంపా బ్యారేజీని పరిశీలించినా విద్యుత్ సరఫరా లేకపోవడంతో గేట్ల పని తీరును పరిశీలించడం సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ శేషగిరిరావు, గేట్లకు మరమ్మతులు చేసే ఏజెన్సీ ప్రతినిధులతో కలసి పంపా బ్యారేజీ గేట్లను ఆదివారం సీఈ పరిశీలించారు. 1, 2, 3, 5 నంబర్ గేట్లకు కొద్దిపాటి మరమ్మతులు సరిపోతాయని అంచనా వేశారు. నాలుగో నంబర్ గేటుకు మాత్రం పూర్తి స్థాయిలో మరమ్మతులు అవసరమని సతీష్ కుమార్ తెలిపారు. గత డిసెంబర్‌లో ఈ గేటు పాడవడంతో పైకి లేవలేదు. దీంతో మిగిలిన నాలుగు గేట్ల ద్వారానే మిగులు నీటిని దిగువకు వదిలారు. పంపా గేట్లు ఒక్కొక్కటి 40 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తు ఉంటాయని సీఈ తెలిపారు. నాలుగో నంబర్ గేటులోని రేకు దాదాపు నాలుగో వంతు పాడైందని, దాని స్థానంలో కొత్త రేకు వేయాల్సి ఉందని చెప్పారు. దీనికే ఎక్కువ మొత్తం ఖర్చవుతుందనే విషయాన్ని మరమ్మతులు చేసే ఏజెన్సీ నిర్ధారించిందని తెలిపారు. మిగిలిన గేట్లకు రోప్‌లు, ఇతర పరికరాలు మార్చాల్సి ఉంటుందన్నారు. ఈ పనులన్నింటికీ రూ.30 లక్షల వ్యయమయ్యే అవకాశం ఉందని, ఆ మేరకు వెంటనే నిధులు విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. పంపా బ్యారేజీకి ఇప్పటి వరకూ జనరేటర్ లేదని తెలిపారు. పాత జనరేటర్ పాడైనట్లు సిబ్బంది తెలిపారన్నారు. దీని వలన విద్యుత్ సరఫరా లేకపోతే గేట్లను మాన్యువల్‌గా ఎత్తడం, దింపడం చేయాల్సి వస్తోందని చెప్పారు. అందువలన జనరేటర్ కూడా కొనుగోలు చేయాలని సతీష్ కుమార్ తెలిపారు.



పంపా బ్యారేజీ గేట్ల పని తీరును పరిశీలిస్తున్న సీఈ, ఎస్ఈ తదితరులు

జెడ్పీటీసీ ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడి

ప్రత్తిపాడు రూరల్: తమ ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఆమె భర్త వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు ఆదివారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. నాలుగు రోజుల కిందట శంఖవరం మండలం వజ్రకూటం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయి. బాధితులకు దొరబాబు దంపతులు స్థానిక సీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. ఈ ఘటనపై మెడికో లీగల్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ దంపతులపై టీడీపీ శ్రేణులు ఆగ్రహించి, దాడికి ప్రయత్నించాయి. దొరబాబు దంపతుల ఇల్లు టీడీపీ నుంచి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఎన్నికైన వరుపుల సత్యప్రభ ఇంటి సమీపాన ఉంది. గత గురు, శుక్రవారాల్లో వరుసగా రెండు రోజుల పాటు టీడీపీ శ్రేణులు జెడ్పీటీసీ సభ్యురాలి ఇంటిని చుట్టుముట్టి దుర్భాషలాడుతూ నానా యాగీ చేశారు. ఈ దాడుల నేపథ్యంలో స్థానికంగా భయానక వాతావరణం నెలకొనడంతో రాజరాజేశ్వరి, దొరబాబు దంపతులు తాత్కాలికంగా సొంతింటిని విడిచిపెట్టి, మెయిన్ రోడ్డులో ఉన్న మరో ఇంటికి మకాం మార్చారు. దీనిపై ఫిర్యాదు చేసినా స్థానిక పోలీసులు చర్యలు తీసుకోలేదని జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఆమె భర్త దొరబాబు తెలిపారు.

నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



శిక్షణా తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: వైద్య విద్యా కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం అనేక అనుమానాలు కలిగిస్తోందని అఖిల భారత విద్యా సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఈ ఫలితాలు, పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సిట్టింగ్ జడ్జితో పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ సాంబమూర్తి నగర్‌లోని పీఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హర్యానాలో ఒకే సెంటర్‌లో నీట్ పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఈ ఫలితాలు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఉన్నాయని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. దీని వల్ల వేలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారన్నారు. యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడి, వాటి అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని శివారెడ్డి తెలిపారు. రాజకీయ పాఠశాల కరపత్రాలను ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు చేతుల మీదుగా ఆవిష్కరించారు.

క్లుప్తంగా

అంతర్వేది స్వామి సన్నిధిలో కలెక్టర్ దంపతులు



అంతర్వేదిలో కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయం వద్ద వారికి అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. కలెక్టర్ హిమాన్షు శుక్లాకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

ఆలయాల్లో హుండీల చోరీ

అంబాజీపేట: మూడు గ్రామాల్లోని ఆలయాల్లో హుండీలు ఆదివారం అర్ధరాత్రి సమయంలో చోరీకి గురయ్యాయి. కె.పెదపూడి కుడుపూడివారి పాలెంలో ఉన్న శ్రీబాల కనకదుర్గమ్మ ఆలయ తలుపులను పగులకొట్టి హుండీలను దొంగిలించారు. ఈ హుండీలో సుమారు రూ.20 వేలు ఉంటాయని భావిస్తున్నారు. అలాగే పక్కనే ఉన్న శ్రీసిద్ధి వినాయక ఆలయం తాళాలను బద్దలు కొట్టి హుండీలో సొమ్ము చోరీ చేశారు. అంబాజీపేట జయంతినగర్ వద్ద లక్ష్మీగణపతి ఆలయ తాళాలను పగులకొట్టి అక్కడున్న హుండీని పట్టుకుపోయారు. సుమారు ఇందులో రూ.20 వేలు ఉంటుందని అంచనా. ముక్కామలలోని ఓ ఆలయంలో కూడా హుండీ చోరీ జరిగింది.

ఏడుగురిపై కేసు నమోదు

కొత్తపల్లి: పలువురిపై దాడిచేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. కొండెవరం శివారు శీలంవారి పాకలులో రామాలయాన్ని శనివారం ఉదయం శుభ్రం చేస్తుండగా ఫ్యాన్ ఆపాలని పోలవరపు శివను రాయుడు వరలక్ష్మి అడిగింది. దీంతో ఆమెపై దుర్భాషలాడాడు. ఆమె ఆలయ కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. రాత్రి కమిటీ సభ్యులు చర్చిస్తుండగా శివ వర్గం వారు, వరలక్ష్మి వర్గానికి చెందిన రాయుడు వెంకటరమణ, పిల్లి లోవరాజు, వాసంశెట్టి శ్రీనులపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలవరపు శివ, పోలవరపు ప్రసాద్, వాసంశెట్టి రామచంద్రరావు, వాసంశెట్టి ఏడుకొండలు, వాసంశెట్టి వెంకన్న, వాసంశెట్టి రాంబాబు, వాసంశెట్టి సాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామినాయుడు తెలిపారు.

ఏవండి.. ఏం తినాలండి



కూరగాయలు చూస్తే మోజు.. ధర మాత్రం చేదు

- కొండెక్కుతున్న కూరగాయల ధరలు
- సెంచరీ దాటిన పచ్చిమిర్చి
- కొనలేకపోతున్న సామాన్యులు

కాకినాడ సిటీ: ఏం కొనేట్టు లేదు.. ఏం తినేట్టు లేదు.. కూరగాయల ధర చూస్తుంటే రోజురోజుకూ కొండెక్కుతోంది. కిందకు దిగిరానంటోంది.. నిన్న మొన్నటి వరకూ ఓ మోస్తరులో ఉండే ధర నేడు చుక్కలను తాకింది. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలను చూస్తేనే సామాన్యుల గుండె గుబేలుమంటోంది. ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏం కొనలేపోతున్నామని వినియోగదారులు అల్లాడుతున్నారు. మరోవైపు పప్పు దినుసుల ధరలూ భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.80కి పైనే ఉంటోంది. ఇక ప్రైవేట్ వ్యాపారుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎండాకాలం పేరిట మరింత ధరలు వడ్డించి విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 60 శాతం మంది రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు. జిల్లాలోని పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, కాకినాడ రూరల్, తుని, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచి రైతుబజార్లకు కూరగాయలు వస్తుంటాయి. వర్షాభావ పరిస్థితులతో సాగు తగ్గి ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.

వంటింట ధరల మంట

వంటింట్లో ఎలాంటి వంటకం చేయాలన్నా టమాటా, పచ్చిమిర్చి తప్పనిసరిగా ఉండాలి. రోజువారీ వాడకంలో కీలకమైన వీటిలో మిర్చి ధర ఘాటెక్కిస్తుంది. ఏకంగా సెంచరీ దాటేసింది. టమాటా ప్రస్తుతం రూ.50కి చేరింది. దొండ, బెండ, బీర, కాకరకాయ ధరలు భారీగానే పెరిగాయి. వంకాయ కూడా టమాటాతో పోటీపడి రూ.70 కిలో పలుకుతోంది. ఇక క్యారెట్, బీన్స్, బీట్‌రూట్, చిక్కుడు ధరలు వందకు చేరువయ్యాయి. ఒకవైపు భగభగమండే ఎండలతో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు పెనుభారంగా మారాయి. వాటిని కొనుగోలు చేయడం అటుంచితే ధరలు వింటేనే ఆందోళన చెందుతున్నారు. కిలోల్లో కొనుగోలు చేసేవారు ఇప్పుడు పావు, అర కిలోలతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు పెరగడానికి ఎండల ప్రభావమే కారణమని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు ఎక్కువగా కర్నూలు, చిత్తూరు, బెంగళూరు, తమిళనాడు, తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. రైతుబజార్లు, మార్కెట్లలో కూరగాయలు కొనడానికి వచ్చిన సామాన్య, మధ్యతరగతి ప్రజలు ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు.

ధరలు ఎలా ఉన్నాయంటే..

టమాటా మొదటి రకం కిలో రూ.50కు విక్రయిస్తుండగా, షాపింగ్ మాల్స్‌లో రూ.70 నుంచి రూ.80 ఉంటోంది. మార్కెట్‌లో కిలో పచ్చిమిర్చి రూ.100కు అమ్ముతున్నారు. బీట్‌రూట్ కిలో ధర రూ.40 నుంచి రూ. 80కు, బంగాళాదుంపలు రూ.40కు చేరాయి. ఉల్లిపాయలు రూ.30 నుంచి రూ.50కి అమ్ముతున్నారు. గతంలో చవకగా లభించిన క్యాప్సికం కిలో ధర రూ.55 నుంచి రూ.70, క్యాబేజీ కిలో రూ.40 నుంచి రూ.54, క్యాలీఫ్లవర్ రూ.30 నుంచి 45కు పలుకుతోంది. క్యారెట్ ధరలు రూ.41 నుంచి రూ.80కి పెరిగింది. రూ. 20లకు లభించే ఒక కొబ్బరికాయను రూ. 30, రూ.40 అమ్ముతున్నారు. కొత్తిమీర, కరివేపాకు నుంచి గోంగూర, పాలకూర, తోటకూర తదితర అన్ని ధరలూ పెరిగాయి. వంకాయ కిలో రూ.80కు చేరింది. పది నిమ్మకాయలను ప్రస్తుతం రూ.70 నుంచి రూ. 90 అమ్ముతున్నారు.

పంట ఎక్కడంటే..

జిల్లాలో జగ్గంపేట, పెద్దాపురం, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని తదితర ప్రాంతాల్లో కూరగాయలు పండిస్తారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి కూరగాయలు మరోనెల రోజుల వరకూ తక్కువగానే వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు. దీనివల్ల దూరప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి రావడంతో రవాణా చార్జీల భారంతో ధరలు పెరిగాయని మార్కెట్ వ్యాపారులు వివరిస్తున్నారు.

ధరలు నియంత్రించాలి



పెరిగిన కూరగాయల ధరలు ఇబ్బందిగా మారాయి. ఎండలతో పాటే కూరగాయల ధరలు సైతం మండుతున్నాయి. గతంలో రూ.500కు సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం మూడు, నాలుగు రకాలు సైతం రాలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ధరలు నియంత్రించాలి.

– మండవ సమాధానం, తూరంగి, కాకినాడ

ఏం కొనలేని పరిస్థితి




బహిరంగ మార్కెట్‌తో పాటు రైతు బజార్‌లోనూ కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. టమాటా కిలో రూ. 50 దాటగా, ఇతర రకాలు వందకు చేరువయ్యాయి. పెరిగిన ధరలతో ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. కిలోల చొప్పున కొనుగోలు చేసేవారు కూడా పావు, అర కిలోలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

– బి కిరణ్‌బాబు, కాకినాడ

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

- చెప్పుల దండ వేసిన దుండగులు
- కేసు నమోదు చేసిన పోలీసులు



అవమానానికి గురైన అంబేడ్కర్ విగ్రహం

కె.గంగవరం: మండల పరిధిలోని యర్రపోతవరంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అంబేడ్కర్ చేతిలో రాజ్యాంగం పుస్తకానికి చెప్పుల దండవేసి అవమానపరిచారు. దీంతో పాటు గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబుతో పాటు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను తీవ్రంగా దూషిస్తూ కాగితంపై లేఖ రాసిపెట్టారు. ఈ సంఘటనను ఆదివారం ఉదయం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు, కె.గంగవరం ఎస్సై జానీబాషా చేరుకుని పరిశీలించారు.



సంఘటనా స్థలం వద్ద డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

జిల్లా ఎస్పీ ఆదేశాలతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లకు సమాచారం అందించి ఆధారాలు సేకరించారు. దీనిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సీఐ దొరరాజు, ఎస్సై జానీబాషా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసేందుకు మూడు టీమ్‌లు ఏర్పాటు చేశామని, నిందితుల జాడ కోసం గాలిస్తున్నామన్నారు. సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదన్నారు. స్థానికులకు ఏమైనా వివరాలు తెలిస్తే పోలీసులకు తెలపాలని వారు విజ్ఞప్తి చేశారు.



ద్రాక్షారామలో విలేకరులతో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

యర్రపోతవరంలో ఉద్రిక్తత

ఈ విషయం తెలుసుకున్న పలు దళిత సంఘ నాయకులు, వివిధ గ్రామాల దళితులు భారీగా యర్రపోతవరం చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో సంఘటనా స్థలం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కొంత సేపు రోడ్డుపై బైటాయించి నిందితులను పట్టుకోవాలని నినాదాలు చేశారు. వెంటనే పోలీసులు స్పందించి నిందితులు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. మరో 24 గంటల్లో నిందితులను పట్టుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని దళిత సంఘాలు హెచ్చరించాయి. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలదండలు వేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

రామచంద్రపురం రూరల్: యర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దోషులను కఠినంగా శిక్షించాలని దళిత ఐక్య పోరాట వేదిక, జై భీమ్ దళిత సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ద్రాక్షారామ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయం వద్ద వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రేవు నాగేశ్వరరావు, జై భీమ్ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరి ఆరాధ్య దైవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల జోలికి ఎవరూ పోకుండా కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి అపచారం చేసిన దుండగులు ఎవరైనా 24 గంటల్లోగా అరెస్ట్ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దళిత నాయకులు వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగ్గంపేట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు కథనం ప్రకారం .. కాట్రావులపల్లికి చెందిన కుంచే దత్తాత్రేయ, గండేపల్లి మండలం పి.నాయకంపల్లికి చెందిన ముమ్మన గంగాభవానీలకు 2015లో వివాహం జరిగింది. ఏడాది పాటు వారి కాపురం సజావుగా జరిగినా ఆ తర్వాత నుంచి దత్తాత్రేయ తన భార్య గంగాభవానీని వేధించడం ప్రారంభించాడు. దీనిపై అనేక మార్లు పెద్దలు సఖ్యత కుదిర్చారు. అయినా దత్తాత్రేయలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో గతంలో గంగాభవానీ రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో దూకగా స్థానికులు రక్షించారు. ఈ నెల 8న భోజనం విషయంలో దత్తాత్రేయ తన భార్య గంగాభవానీతో ఘర్షణకు దిగాడు. మనస్తాపం చెందిన ఆమె కాట్రావులపల్లిలోని తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన అత్తమామలు ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ముమ్మన సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరాజు వివరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు 385 మంది ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు జీఎస్ వెంకటదుర్గసాయి 53వ ర్యాంకు, కె.సాకేత్ ప్రణవ్ 92, జి.సత్యనారాయణ 114, బి.హేమంత్ 123, ఎస్.నిషాంత్ 126, ఆర్.పవిత్ర 129, ఎం.వినేష్‌కుమార్ 133, ఎంజీ వెంకటమహేష్ 136, ఎం.చరణ్‌శ్రీతేజ 157, ఎస్.హార్దిక్ 217, జి.చంద్రప్రకాష్ 225, ఎం.శ్రీమణికంఠ 235, టి.ఆదిత్య 236, సీహెచ్ ధనుంజయ 276, పి.సాయిఅమృత్ 291 ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు 342, 352, 372, 391, 407, 424, 427, 440, 476 ర్యాంకులు వచ్చాయన్నారు. వెయ్యిలోపు 49 మంది, 3 వేలలోపు 163 మంది, 5 వేలలోపు 256 మంది, పది వేలలోపు 334 మంది ర్యాంకులు సాధించారని, 180 మంది పైన విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించగలరని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి అభినందించారు.

శ్రీషిర్డీసాయి విజయభేరి



జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాజమహేంద్రవరం శ్రీషిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న జె.శ్రీకర్ ఆల్ ఇండియా 189వ ర్యాంకు, కె.వెంకట శివరామకృష్ణ 253, బి.తనుశ్రీ 578 ర్యాంకు సాధించారన్నారు. ఏడుగురు వెయ్యి లోపు, 15 మంది రెండు వేల లోపు, 26 మంది ఐదు వేల లోపు, 38 మంది పది వేల లోపు ర్యాంకులు సాధించినట్లు శ్రీవిద్య తెలిపారు. శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హాజరైన 75 మంది విద్యార్థుల్లో 38 మంది దేశంలోని అత్యుత్తమ ఐఐటీలలో సీట్లు సాధించగలరన్న ఆశాభావం వ్యక్తపరిచారు. ప్రతి ఏటా తమ విద్యార్థులు రాణించడంపై హర్షం వ్యక్తం చేశారు. విజేతలు, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

జేఈఈలో 'ఆదిత్య'కు ర్యాంకులు



సత్యనిహాంత్



రఘురామసహాన్



కీర్తిఐశ్వర్య

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి ఆదివారం తెలిపారు. విద్యార్థులు ఎ.సత్యనిహాంత్ 23వ ర్యాంక్, ఎం.రఘురామసహాన్ 32, కె.కీర్తి ఐశ్వర్య 68, ఎ.చరణ్‌ఉమేష్ 86, బి.ప్రభాత్ వెంకటసాయి 122, ఎం.విశ్వక్ 180 ర్యాంక్ సాధించారన్నారు. వీటితో పాటు వంద లోపు నలుగురు, 500 లోపు 12 మంది, వెయ్యి లోపు 22 మంది, 5 వేల లోపు 82 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి మాట్లాడుతూ రెగ్యులర్ ఇంటర్మీడియెట్ విద్యార్థులతో సాధించిన ఫలితాలు జాతీయ స్థాయిలో మరోసారి విజయకేతనం ఎగురవేసిందన్నారు. ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్య అందించడంతోనే ర్యాంకులు సాధించగలిగామన్నారు. విజేతలను హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్ ఎన్.సుగుణ, శృతి, ప్రిన్సిపాల్ జె.మెయినలు అభినందించారు.

పీఠంలో శ్రీరామ ధనస్సుకు పూజలు



పీఠంలో శ్రీరామ ధనస్సుకు పూజలు చేస్తున్న దృశ్యం

రాయవరం: వచ్చే ఏడాది అయోధ్యలో ప్రతిష్ఠించే శ్రీరాముడి విగ్రహానికి అమర్చే శ్రీరామ ధనస్సుకు వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం తొలి పూజలు నిర్వహించారు. తెలంగాణకు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి తయారు చేయించిన శ్రీరామ ధనస్సును విజయదుర్గా పీఠానికి తీసుకు వచ్చారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) చేతుల మీదుగా పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది అయోధ్యలో సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠిస్తారన్నారు. శ్రీరాముడు చేతబూనేలా 14 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో ధనస్సును తయారు చేయించానన్నారు. కిలో వెండితో బాణం తయారు చేయించినట్టు తెలిపారు. ప్రతిష్ఠ సమయంలో శ్రీరాముల వారికి సమర్పించాలనే సంకల్పంతో చేయించిన ధనస్సుకు తొలిసారిగా పీఠంలో పూజలు చేయించామన్నారు. శ్రీలంక నుంచి బదరీనాథ్ వరకూ దేశంలో పలు పుణ్యక్షేత్రాల్లో శ్రీరాముని ధనస్సుకు పూజలు నిర్వహించాక అయోధ్యకు తరలించనున్నట్టు వివరించారు. తొలుత పీఠంలో సీతారాముల విగ్రహాల వద్ద ఉంచి వేదపండితులు పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ధనస్సును చూసేందుకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పీఠంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, పీఠంలో అన్నసమారాధన చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, పెదపాటి సత్య కనకదుర్గ, బలిజేపల్లి రమ, అన్నవరం దేవస్థానం మాజీ పాలకవర్గ సభ్యుడు కందర్ప హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో నిందితుడిని చూపుతున్న పోలీసులు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలోని ఎస్ఈబీ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో 46 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ ఎస్సై రామస్వామి తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తుండగా అతన్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం తాళ్లరేవు ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ రాజు, రామకృష్ణ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా



ఆలమూరులో లారీతో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

ఆలమూరు: రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టు అయ్యింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ దాడుల్లో అది బహిర్గతమైంది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని శ్రీకనకదుర్గ రైస్ ట్రేడర్స్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా కాకినాడలోని లవన్ ఇంటర్నేషనల్ సంస్థకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో రాజమహేంద్రవరం విజిలెన్స్ శాఖ అప్రమత్తమైంది. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీఐలు కిశోర్, జగన్నాథరెడ్డి, వలీతో పాటు పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖ అధికారులు జొన్నాడలో ఆదివారం నిఘా ఉంచారు. ఆ రహదారిలో ఆదివారం వెళుతున్న లారీని వెంబడించి స్థానిక ఎస్ మలుపు వద్ద నిలిపి తనిఖీలు చేశారు. అందులో 480 బస్తాల్లోని రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లారీని సీజ్ చేసి, అందులోని 23.5 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మండపేట పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించారు. సీజ్ చేసిన లారీని స్థానిక పోలీసులకు అప్పగించారు. దీంతో ఎస్సై ఎల్.శ్రీనునాయక్ ఇరు సంస్థలపైన 6ఏ కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.18,69,250 ఉంటుందని విజిలెన్స్ శాఖ అంచనా వేసింది. జిల్లాలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం కొనుగోలు చేయడం, విక్రయించడం నేరమన్నారు. ఈ దాడిలో ఎస్‌డీటీ ఎస్‌కే అలీషా, తహసీల్దార్ డీవీఎస్ అనీల్‌కుమార్, వీఆర్వో వెంకట్ పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగం చేసిన ఎన్నికల సంఘం

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆరోపణ



రాజమహేంద్రవరం సిటీ: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో ఓటరు ఓటు వేసుకున్నాడో.. ఈవీఎం ఆటోమెటిక్ ప్రోగ్రాం ద్వారా కట్ ఆఫ్ ఓట్లు వేసుకున్నాయోననే అనుమానాలు అందరినీ వెంటాడుతున్నాయని ఆయన అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌పీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

ఎన్నికల సంఘానికి రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వచ్చినా ఏ ఒక్క దానిపైనా స్పందించకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా అనేక పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయని, ఈ దఫా ఎన్నికల నిర్వహణలో ఓటుకు పెద్దగా గోప్యత లేకుండా పోయిందన్నారు. ఈవీఎంలలో పోలైన ఓట్ల సంఖ్యకు, పోటీ చేసిన అభ్యర్థులకు పోలైన ఓట్ల సంఖ్యను మొత్తంగా లెక్కపెడితే అనేక చోట్ల తేడా వచ్చిందని అన్నారు. అలాంటి ఘటనలపై ఇప్పటికే ఫిర్యాదులు అందినట్టు తెలుస్తుందన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని అన్నారు. అతి పెద్ద ఎన్నికల మోసాన్ని బహిర్గతం చేయగల నేర పరిశోధన సంస్థ దేశంలో లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల నిర్వహణ ప్యానల్‌లోని ముగ్గురు సభ్యుల్లో ఒకరైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ఆ స్థానంలో మోదీ కేబినెట్‌లో మంత్రిని నియమించారన్నారు. ఇదంతా వ్యూహాత్మకంగా మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయమని ఆయన ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ప్రక్రియ ఉన్నంతకాలం మోదీని గెలవడం సునాయాసం కాదన్నారు. భారత్ పాలనను తెర వెనుక నుంచి శాసించేది కొన్ని కార్పొరేట్ శక్తులేనని, పేరుకు మాత్రమే దేశంలో ఎన్నికల సంఘం ఉందన్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో చంద్రబాబు సైతం ఈవీఎంల పనితీరుపై ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇలాంటి అక్రమాలు గత 30 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ చూడలేదని, ఎన్నికల సంఘం అక్రమాలపై విచారణకు ఆదేశించి రాజమహేంద్రవరం పార్లమెంట్ ఎన్నిక విజయాన్ని రద్దు చేసి తిరిగి ఎన్నిక నిర్వహించాలని మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమావేశంలో పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు, శీరపు పురంధేశ్వరి తదితరులు పాల్గొన్నారు.